జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజా జ్యోతి
ప్రతి అక్షరం - ప్రజాల కోసం
## నిజామాబాద్
ఆదివారం 24 నవంబర్ 2024 www.prajajyothinews.com పేజీలు :04

## రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఆర్మూర్ నారాయణ పాఠశాల విద్యార్థి ఎంపిక



**ప్రజాజ్యోతి నిజామాబాద్ బ్యూరో :** ఈ నెల 23 నుండి 25 వరకు మెదక్ జిల్లాలోని మాసాయిపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో జరుగుతున్న 9వ రాష్ట్ర స్థాయి సబ్ జానియర్ సాఫ్ట్ బాల్ బాలుర ఛాంపియన్ షిప్ కు ఆర్మూర్ నారాయణ హై స్కూల్ విద్యార్థి రీషీ అత్రేయ ఎంపికైనట్లు పాఠశాల పీఈటీలు మోహన్,మీనా తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థిని తెలంగాణ నారాయణ పాఠశాల జీఎం గోపాల్ రెడ్డి, నిజామాబాద్ జోన్ ఏజీఎం,శివాజీ, ప్రిన్సిపల్ రజనీ కుమారి,ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## విద్యార్థులకు రుచికరమైన ..
# పౌష్టికాహారం అందించాలి



### కేజీబీవీ, మోడల్ స్కూళ్లను తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాజ్యోతి నిజామాబాద్ ప్రతినిధి:నిజామాబాద్, నవంబర్ 23 : జక్రాన్ పల్లి మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని, మోడల్ స్కూల్ ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డార్మెటరీ, స్టోర్ రూమ్, కిచెన్, ప్లే గ్రౌండ్ తదితర వాటిని పరిశీలించారు. స్టోర్ రూమ్ లో నిల్వ ఉంచిన సన్నబియ్యం, ఇతర సరుకుల నాణ్యతను, విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని పరిశీలించారు. ఉడకబెట్టేందుకు సిద్ధంగా ఉంచిన కోడి గుడ్లను నీటితో నిండి ఉన్న గిన్నెలో వేసి ఏవైనా చెడిపోయినవి ఉన్నాయా అని తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఆహార పదార్థాలు, భోజనం వండేందుకు వినియోగించే పదార్థాలు కలుషితం కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వహకులకు సూచించారు. స్టోర్ రూమ్ లో గోధుమ పిండి, ఇతర ప్యాకెట్లు తెరిచి ఉండడాన్ని గమనించిన కలెక్టర్, వాటిని కలుషితం కాకుండా జాగ్రత్తగా భద్రపర్చాలని సూచించారు. కల్తీ, నాసిరకమైన బియ్యం, ఇతర ఆహార పదార్థాలు, కూరగాయలు సరఫరా చేసిన సమయంలో అధికారులకు సమాచారం అందించాలన్నారు. విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. విద్యార్థినులను పలుకరించి వారికి అందిస్తున్న భోజన, వసతి సదుపాయాలు, విద్యా బోధన, రోజువారీ దినచర్య గురించి ఆరా తీశారు. చక్కగా చదువుకుని ఉన్నత స్థానాలు అధిరోహించాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తహశీల్దార్, ఇతర అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్, తహశీల్దార్ కిరణ్మయి తదితరులు ఉన్నారు.



## ఇందిరమ్మ ఇళ్ల పైలెట్ సర్వే ను పరిశీలించిన కలెక్టర్



**ప్రజాజ్యోతి నిజామాబాద్ ప్రతినిధి:నిజామాబాద్, నవంబర్ 23 :** జక్రాన్ పల్లి మండలం మాదాపూర్ గ్రామంలో ప్రయోగాత్మకంగా నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పైలెట్ సర్వేను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను ఆన్లైన్ ద్వారా సంబంధిత యాప్ లో నమోదు చేస్తున్న తీరును పరిశీలించారు. కలెక్టర్ స్వయంగా దరఖాస్తుదారుల ఇళ్లను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సొంత స్థలం కలిగి ఉన్నారా, ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇంటి యజమాని ఎవరు, పాత పెంకుటింట్లో ఉంటున్నారా లేక పక్క గృహమా తదితర అంశాలను పరిశీలిస్తూ ఆన్లైన్ యాప్ లో నమోదు చేశారు. గ్రామంలో ఇప్పటివరకు ఎంతమంది వివరాలను సేకరించారు, ఆన్లైన్లో ఎన్ని వివరాలను అప్లోడ్ చేశారని అధికారుల నుండి సమాచారం సేకరించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పక్కాగా వివరాలను సేకరిస్తూ ఆన్లైన్ లో నమోదు చేయాలని సూచించారు. వివరాల నమోదులో ఏవైనా ఇబ్బందులు ఏర్పడితే అధికారుల దృష్టికి తేవాలని, నిర్ణీత గడువులోపు పైలెట్ సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.



## మహారాష్ట్ర లో బీజేపీ గెలుపు పట్ల నగరంలో బీజేపీ సంబురాలు

**ప్రజా జ్యోతి నిజామాబాద్ బ్యూరో :**

భారతీయ జనతా పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిఖిల్ సాయి చౌరస్తా లో మహారాష్ట్ర ఫలితాల పై విజయోత్సవ సంబురాలు నిర్వహించారు. ఈ సంబరాల్లో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ,జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి పాల్గొన్నారు. అనంతరం కార్యకర్తలతో కలిసి మిఠాయి పంచుకొని,టపాసులు కాల్చి హర్షం వ్యక్తం చేసారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ గ్యారంటీల మోసానికి మరాఠ ప్రజలు తగిన బుద్ది చెప్పారని అన్నారు.మోదీ నాయకత్వంలో బిజెపితోనే అభివృద్ధి సాధ్యమని మరాఠ ప్రజలు మరోసారి డబుల్ ఇంజన్ సర్కార్ ను కోరుకున్నారని హర్షం వ్యక్తం చేసారు.ఈ సందర్భంగా మహారాష్ట్ర ఓటరు మహాశయులందరికీ పేరు పేరున ధన్యవాదములు తెలిపారు.పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి వస్తే రిజర్వేషన్ రద్దు చేస్తుందన్న అబద్దపు ప్రచారం చేసి కుట్ర చేసిన కాంగ్రెస్ కు అసెంబ్లీ ఎన్నికల్లో మహారాష్ట్ర ప్రజలు తగిన బుద్ది చెప్పారన్నారు.దీన్ని ఈవీఎంల గోల్ మాల్ జరిగిందని కాంగ్రెస్ అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు.తెలంగాణ నుండి ముఖ్యమంత్రి రేవంత్ ప్రచారానికి పోయి ఇజ్జత్ తీసుకున్నాడని అన్నారు.రేవంత్ తిరిగిన ఒక్క స్థానంలో కూడా కాంగ్రెస్ కూటమి గెలవలేదని ఏద్దేవా చేసారు.మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు ఖచ్చితంగా తెలంగాణపై కూడా ప్రభావం చూపుతాయి అన్నారు.రేవంత్ కు మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలతో కుర్చీ భయం పట్టుకుందని అన్నారు.తెలంగాణ మంత్రులందరు ఆలోచనలో పడ్డారని,ఇప్పటికైనా కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీలు,హామీలు అమలు చేయకపోతే వచ్చే స్థానిక,కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ ను బొంద పెట్టడం ఖాయం అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగరెడ్డి,పార్లమెంట్ కన్వీనర్ గద్దె భూమన్న,స్థానిక కార్పొరేటర్లు,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# నగరంలో మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ పర్యటన







## - 35వ డివిజన్ ను సందర్శించిన మున్సిపల్ డిప్యూటీ కమిషనర్

**ప్రజాజ్యోతి నిజామాబాద్ ప్రతినిధి:** నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని 35వ డివిజన్ నందేవాడ, హమాలీవాడి ప్రాంతాల లో శనివారం మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రాజేంద్ర కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా 35 డివిజన్ కాంగ్రెస్ ఇంచార్జ్ నరేంద్ర గౌడ్ మరియు కాలనీలో కాలనీవాసులు వలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా డ్రైనేజీ సరిగ్గా లేని కారణంగా మురికి నీరు ఇళ్ల ముందు చేరుతున్నట్లు స్థానికులు తెలిపారు. కొత్త పైప్ లైన్, సీసీ డ్రైనేజీ నిర్మించాలని నరేందర్ గౌడ్ కోరారు. కార్పొరేటర్ ఎర్రం సుధీర్ కలిసి పర్యటించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# మాలల సింహ గర్జన సభను విజయవంతం చేయండి



నవంబర్ 23 భీమ్ గల్ ప్రజాజ్యోతి

అస్తిత్వము,ఆత్మగౌరవము, ఐక్యత, అభివృద్ధి, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు వ్యతిరేకంగా జరిగే మాలల సింహ గర్జన సభను విజయవంతం చేయాలని ఎస్సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కో కన్వీనర్ అంగారి ప్రదీప్,ఆర్మూర్ డివిజన్ ఉపాధ్యక్షుడు పులి సాయిరాం అన్నారు.మండల కేంద్రంలోని ఆర్.అండ్ బి గెస్ట్ హౌస్ లో “హలో మాల చలో హైదరాబాద్ “ మాలల సింహగర్జన గోడ ప్రతులను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామం నుండి ఇంటికో మనిషి ఉరికో వాహనంతో వేలాదిగా మాలల అభివృద్ధికి ,ఆత్మగౌరవానికి వ్యతిరేకంగా విధాన నిర్ణయాలు తీసుకుంటున్న రాజకీయ పార్టీల కు తగిన గుణపాఠం చెప్పేందుకై ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను అడ్డుకునేందుకై ప్రతి మాలబిడ్డ పెద్ద ఎత్తున హైదరాబాద్ కు తరలివచ్చి మాలల అస్తిత్వాన్ని ఆత్మ గౌరవాన్ని కాపాడాలని కోరారు.మాలలు డిసెంబర్ 1వ తేదీన పెట్టుకునే బహిరంగసభ ప్రాంగణంలో మాదిగల సభ ఉందని వివిధ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వదంతులను నమ్మవద్దని మాలల సభకు అవాంతరాలు సృష్టిస్తున్న మాదిగ నాయకుల తీరును ఖ%శీ%డిస్తున్నామన్నారు,మాలల సభకు ప్రభుత్వ అనుమతి లభించిందన్నారు ఈ కార్యక్రమంలో భీమ్గల్ మండల మాల సంక్షేమ ఐక్యవేదిక నాయకులు,మరియు మండల పరిసర ప్రాంతాల్లోని మాల యువత,అంబేద్కర్ యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారులి

# ప్రభుత్వ ఆసుపత్రిని బలోపేతం చేయాలి

## ప్రైవేట్ కార్పొరేట్ హాస్పిటల్స్ ఫీజుల దోపిడీని అరికట్టాలి

## పీవైఎల్, పీవోడబ్ల్యూ నాయకుల డిమాండ్




**ప్రజా జ్యోతి నిజామాబాద్ బ్యూరో :** ప్రగతిశీల యువజన సంఘం మరియు ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రభుత్వ ఆసుపత్రి బలోపేతం చేయాలని,ప్రైవేట్ కార్పొరేట్ హాస్పిటల్స్ ఫీజుల దోపిడిని అరికట్టాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ నగరంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కే సంధ్యారాణి,యువజన సంఘం డివిజన్ అధ్యక్షులు సాయిబాబాలు మాట్లాడుతూ ప్రభుత్వ హాస్పిటల్ లో అన్ని రకాల వైద్య పరీక్ష సౌకర్యం కల్పించాలని,ఖాళీగా ఉన్న డాక్టర్స్,నర్సుల,ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని,ఆధునిక వైద్య పరికరాలతో సూపర్ స్పెషాలిటీలతో వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక ఏరియా హాస్పిటల్ లో వైద్య సౌకర్యాలు మెరుగుపరచాలని ప్రభుత్వాస్పిటల్స్ లో మౌలిక వసతులు కల్పించి డాక్టర్లకు నర్సులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రైవేటు కార్పొరేట్ హాస్పిటల్స్ లో ఫీజుల దోపిడిని అరికట్టి,టెస్టుల మందుల పేర్లతో చేస్తున్న వసూళ్లను నియంత్రించాలి. అనవసరమైన ఆపరేషన్ చేయడాన్ని నియంత్రించాలని,ప్రైవేటు కార్పొరేట్ హాస్పిటల్కు తరలించే పి.ఆర్.ఓ సిస్టంను,మెడికల్ మాఫియాను అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు డయాగ్నొస్టిక్ సెంటర్ లపై ప్రభుత్వం నియంత్రణ ఉండాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు లలిత,అమూల్య,యువజన సంఘం డివిజన్ కార్యదర్శి దండు మహేష్ నాయకులు రాజు,మహిళా నాయకులు రజిత,అక్షయ,దేవిక,రాజశ్రీ,నరసవ్వ,బేగం తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం పరిశీలన

- ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం పరిశీలన

కాగా, జక్రాన్పల్లి మండలం మాదాపూర్ గ్రామ పంచాయతీలోని పోలింగ్ బూత్ ను కలెక్టర్ శనివారం సందర్శించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా పోలింగ్ బూత్ లో రెండవ విడత ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాన్ని నిర్వహిస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు. ఎంతమంది కొత్త ఓటర్ల పేర్లు నమోదు చేశారు, మరణించిన ఓటర్ల పేర్లు జాబితా నుండి తొలగించారా తదితర వివరాలను బీ.ఎల్.ఓను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఎస్ఆర్ లో భాగంగా ఇంటింటికి తిరిగి ఓటరు నమోదు వివరాలు సేకరించిన సమయంలో కొత్తగా గుర్తించిన ఓటర్లందరి పేర్లు తప్పనిసరిగా జాబితాలో ఉండేలా చూసుకోవాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా పేర్లు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. 30 నుండి 40 సంవత్సరాల వయస్సు కలిగిన వారు ఓటరుగా పేరు నమోదు కోసం దరఖాస్తు చేసుకుంటే, అలాంటి వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తూ, క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ జరపాలని, ఇదివరకు వారు ఎక్కడైనా ఓటు హక్కు కలిగి ఉన్నారా అన్నది నిశితంగా పరిశీలన చేయాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్, జక్రాన్పల్లి తహశీల్దార్ కిరణ్మయి తదితరులు ఉన్నారు.

# ఉదారత్వం చాటిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు



నవంబర్ 23 భీమ్ గల్ ప్రజాజ్యోతి

భీమ్గల్ మండల కేంద్రంలోనిజిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నందు 2024 - 25 సంవత్సరం పదో తరగతి చదువుతున్న విద్యార్థుల యొక్క పరీక్ష రుసుమునీ ఆ పాఠశాలలో ప్రభుత్వ టీచర్ పనిచేస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయుడు బద్దం శివకుమార్ ఉదారత్వము చాటి విద్యార్థుల యొక్క పరీక్ష రుసుమును చెల్లించారు. విద్యార్థులు యొక్క పరీక్ష రుసుమును పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఎంఈఓ స్వామి చేతుల మీదుగా విద్యార్థులకు పరీక్ష రుసుమును అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయుల బృందం బద్దం శివకుమార్ ని అభినందించారు. సమాజంలో విద్యార్థులకు సాయం చేయడం ఎంతో గొప్ప కార్యక్రమం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లింబాద్రి, వాసుదేవ్ ,వినోద్ కుమార్, రఘువాస్, ఎడ్ల శేఖర్, రాజేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్పీలు, సీఓలు కుమ్మక్కుతో డ్వాక్రా గ్రూప్ మహిళలకు తీవ్ర ఇబ్బందులు

... డ్వాక్రా గ్రూప్ సమస్యలపై పీడీకి వినతి

**ప్రజా జ్యోతి నిజామాబాద్ బ్యూరో :** ఆర్పీలు, సిఓలు కుమ్మక్కవడంతో డ్వాక్రా సంఘంలోని మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హమాల్ వాడి బాలాజీ, శ్రీనిధి డ్వాక్రా గ్రూప్ సమస్యలపై ఐద్వా ఆధ్వర్యంలో మెప్మా పీడీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత మాట్లాడుతూ గతంలో ఉన్న ఓబీ మెంబర్స్ అధ్యక్షురాలు జమున, క్యాషియర్ పి పద్మజ, ఆర్.పి.మాధవి, కార్యదర్శి పద్మ వీరు డబ్బులు తీసుకుని కట్టట్లేదని ఇప్పుడు ఉన్న పీడీ కి తప్పుడు సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు. నవచైతన్య సంఘం, రమా మహిళా సంఘం, శ్రీ సాయి చైతన్య సంఘం, శ్రీ నవ్య ఇలా 13 సంఘాల సభ్యుల నుండి శ్రీనిధి ఇప్పుడు ఉన్న సి ఓ లావణ్య, ప్రస్తుతం ఉన్న సిఓ సవిత, మధుప్రియ, ఆర్.పి.లు స్వర్ణలత, కవిత, సరిత, జ్యోతి, స్వర్ణలత, వీరు శ్రీనిధి 13 గ్రూపుల నుండి వసూళ్లు చేస్తూ సభ్యులకు ఓచర్లు ఇవ్వకుండా బ్యాంకులో కట్టకపోవడం వల్ల 23 డ్వాక్రా గ్రూపుల మహిళలు డ్వాక్రా గ్రూప్ లోన్స్ రాక పొదుపు డబ్బులు కూడా రానివ్వకుండా అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వీరి పై ప్రస్తుతం ఉన్న పీడీ ప్రత్యేకమైన దృష్టి పెట్టి వారికి లోన్లు, పొదుపు డబ్బులు వచ్చే విధంగా చూడాలని ఐద్వా డిమాండ్ చేస్తుందన్నారు. లేకుంటే సమస్య పరిష్కారం అయ్యేంతవరకు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా సంఘాల సభ్యులు శ్రీ సాయి గంగా, శ్రీ నవచైతన్య, తిరుమల, కరుణామయ, గణేష్ సంగం, తదితర సంఘాల నుండి సభ్యులు పాల్గొన్నారు.



## కమిటేషన్ కోతలను నిలిపివేయాలి డీటీవోకు వినతి



**ప్రజా జ్యోతి నిజామాబాద్ బ్యూరో:** రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల పెన్షన్ లో 11 సంవత్సరాలు మూడు నెలలు దాటిన వారికి కమిటేషన్ పేరున కోతలు విధించడాన్ని రద్దు చేస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్?రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా కమిటీ పక్షాన శనివారం డిప్యూటీ డైరెక్టర్ జిల్లా ట్రెజరీ అధికారి దశరథ్ కి మెమోరాండం సమర్పించారు. చట్ట విరుద్ధంగా పెన్షనర్ల వద్ద నుండి ప్రభుత్వం ఈ కోతలకు పాల్పడిందని,దీనిని వెంటనే నిలుపుదల చేయాలని పలువురు పెన్షనర్లు తెలంగాణ హైకోర్టు ను ఆశ్రయించగా దీనిపై ఈ నెల 21న తీర్పు వచ్చిందని,ఆ ప్రకారంగా నవంబర్ 24నుండి కోతలను నిలుపుచేయాలని ఉత్తర్వులు ఇచ్చినట్లు సంఘం జిల్లా అధ్యక్షులు కె.రామ్మోహన్ రావు తెలిపారు. అదేవిధంగా ఇప్పటివరకు పెన్షనర్ల వద్ద నుండి అక్రమంగా వసూలు చేసిన డబ్బును తిరిగి పెన్షనర్ల ఖాతాలో వేయాలని వారు డిమాండ్ చేశారు.డి టి వో ను కలసినవారిలో జిల్లా నాయకులు డి. లక్ష్మీ నారాయణ,శ్రీనివాస్ రెడ్డి,బుచ్చి రాజయ్య,నరేందర్,పుండరీ నీలం రెడ్డి,తదితరులు ఉన్నారు.